# ★ పుంభావ సరస్వతి ★

(కథానిక)

'ఇదిగోరా అబ్బీ నీ పుస్తకం. ఇంతోటి దానికే నువు చచ్చిపోతున్నావు' అని ఇచ్చేశాడు అచ్యుతరావు, శృంగార కథల మాస పత్రికను సుబ్బారావుకు.

'దాన్లో నా కథ చదివావా?...ఎలా వుంది?' అన్నాడు సుబ్బారావు ఆ పుస్తకంలో పేజీలు తిప్పుతూ.

'చదివాను. బాగానే వుంది. సులభంగా శృంగారాన్ని అట్టా అరిటిపండు వొలిచినట్టు చెప్పేదానికంటె మనస్తత్వాన్ని వర్ణించి అయిడియా వేసేస్తే అంతకంటె బావుంటుంది. నీకిది యెన్నో సార్లు చెప్పాను ఇదివరకు' అన్నాడు అచ్యుతరావు.

'సరిలే. తరవాత-'సరస్వతీదేవి' రాసిన ఈ కథ చదివావా?'

'చదివాను. ఈ పుస్తకం అంతటికీ అది గొప్ప కథ అని చెప్పవచ్చు. నే నిప్పుడు చెప్పిన పద్ధతిలో నడిచింది ఆవిడ కథ.'

'అంతేకాదురా. మనస్తత్వాన్ని వర్ణించడంలో-ఎంతో స్వాభావికమైన పంథా త్రొక్కింది. ఉదాహరణలతో, అలంకారాలతో వాతావరణంలో మనస్సెలా పరిణామం పొందుతుందో చాలా బాగా రాసింది. అందుచేత అది ప్రకృతి సహజమని అడుగడుగునా స్ఫురిస్తుంది. ఏమంటావ్?'

'నిజమే' అన్నాడు అచ్యుతరావు.

సరస్వతీదేవి రాస్తూండే కథల్ని ప్రచురించే పత్రికలో సుబ్బారావుకూడా అప్పుడప్పుడు వ్రాస్తూంటాడు. అతనికి తన కథలకంటె ఆ కథలే యెక్కువ యిష్టం. శృంగార శాస్త్రంలో బాగా అనుభవం కలిగిన రచయిత్రిలా-ఎంతో స్వాభావికంగా రాస్తుంది ఆమె. మాటకి మామూలుగా తక్కువ రకం చదువరులు ఒప్పుకునేటట్టు కలపదు, ఆమె తన ప్రేయసీ ప్రియులని. ఎంతో ఓపిక కలవాళ్ళుగా నిరూపిస్తుంది. అదే సుబ్బారావుకు ఇష్టం. ఇష్టం మాత్రమే కాదు, తన్మయం తెచ్చేస్తుంది ఆ రచన మానవులలో శృంగారం పట్ల తొందర చాలా తక్కువనీ, ఓపిక యెంతో ఎక్కువనీ, ఈ ఓపిక వాతావరణాన్ని బట్టి ఇంకా ఆకాశమంత అయిపోతూంటుందనీ విశ్వసించి వాదించే వాళ్ళలో అతనొకడు. మరి సరస్వతిదేవి తన కథలలో సుబ్బారావుకు ఇష్టమైన పాత్రల్ని ప్రవేశపెడుతున్నది. అందుచేత ఆమె కథలంటే అతనికంత యిష్టం.

ఆ మాసపత్రిక సంపాదకుడు కూడా మంచి అభిరుచికలవాడే. లేకపోతే అంత స్వాభావికమైన కథలని ప్రచురించడు. అసలు ఇంతకీ ఇంకొకటి వుంది. ఆ సంపాదకుడు మంచి అభిరుచి కలవాడు కాబట్టే తన కథలు ప్రచురిస్తున్నాడు. ఏ సంపాదకుడు తన కథల్ని ప్రకటిస్తాడో అతడే మంచి అభిరుచి కలవాడని సుబ్బారావు ఆత్మ విశ్వాసం. దీన్నిబట్టి అతని అభిరుచిని గ్రహించుకో వచ్చును. అభిరుచి మాత్రమే కాదు. చాతుర్యంకూడా తెలుస్తుంది.

అయితే ఆ మాసపత్రిక సంపాదకుడు మంచి అభిరుచి కలవాడు మాత్రమే కాదు. ఆమెకు ఏదో దగ్గిర బంధువు. లేదూ అంటే బాగా తెలిసిన వాడయినా అయివుండాలి. లేకపోతే ముద్రితమైన కాడికి పదేసి కథలు ఒక్కొక్క సంపుటంగా అప్పుడే రెండు సంపుటాలు వేశే ముద్రింపించాడు. పుస్తకాల గెటప్ కూడా బాగానే వుంది. రచన-సరస్వతిదేవి. తియ్యటి కథలు. తాను, రెండో సంపుటంమీద సమీక్ష కూడా వ్రాశాడు; ఆ సంపాదకుడు తన పేర ప్రకటించాడు గాని!

ఇంకొకనాడు ఆ రచయిత్రి వ్రాసిన కథలో ఒక చాలా పెద్ద నవలకారుడిని ఒక మంచి

ఆధారం తీసుకుని విమర్శించింది. ఆ నవలాకారుడిలో తప్పులు లేవన్నది అందరూ ఒప్పుకునే విషయం. కాని ఆ సరస్వతీదేవికి ఎట్లా కనపడ్డదో, చాలా పెద్ద తప్పొకటి కనపడ్డది. ఈ తప్పు ఆ ఒక్క నవలలోనే కాదనీ - ఇంకా ఆ నవలాకారుడు వ్రాసిన ఇతర నవలలన్నిటిలోనూ మానవ జీవితానికి ఎంతో అవసరమైన ఒక విషయం గురించిన వర్ణన ఎక్కడా కనుపించదనీ- ఇది చాలా అన్యాయమనీ సరస్వతీదేవి విమర్శించింది. దాంతో సుబ్బారావు ఎంతో సంతోషించాడు. తాను కూడా అదే ఉద్దేశాన్ని కలిగిఉన్నాడు - ఎవరితోనూ చెప్పలేదు గాని.

సుబ్బారావు చర్యలు స్నేహితుల కంట పడ్డాయి. అతనికి ఆంధ్ర శృంగార కథలన్నిటిలోనూ సరస్వతీదేవి వ్రాసినవి నచ్చుతున్నై. ఆమె రచన ఉంటేచాలు ఆ పుస్తకం కొనేస్తాడు. మాట్లాడితే చాలు ఆమె రచన సంగతి ఎత్తుతాడు. ఒకసారి ఎవడో స్నేహితుణ్ని 'సరస్వతీదేవి కథలు చదివి నాతో మాట్లాడు!' అని కసిరాడు ఉద్రేకంగా. మరొకనితో 'నాకున్న జనరల్ నోలెడ్జి, నీకు లేదు. నేను చదివినన్ని సరస్వతీదేవి కథలు నువ్వు చదవలేదు.' అని కూడా అన్నాడు. ఇంకొకతను 'సరస్వతీదేవి కథలని అలా ఛస్తావు- ఎందుకు, దాంట్లో యేముందనీ, వొట్టి పచ్చిబూతులు రాస్తుంది' అని అంటున్నాడు ఇంకా నమ్రతగా. అతనిమీద విరుచుకపడి తన్నినంత చేసి 'నీకు టేస్టు లేదు పొ'మ్మన్నాడు.

ఇలా మరొక ఆరునెలలు గడిచాయి. అప్పటికి సరస్వతీదేవి కథల సంపుటాలు సుబ్బారావు దగ్గిర అయిదు ఉన్నాయి. ఆమె యింకా పత్రికల్లో వ్రాస్తూనేఉంది. తానూ వ్రాస్తున్నాడు. కాని ఈమధ్య అతనికి సరస్వతీదేవి మీద అభిమానం మరీ యెక్కువై పోయింది.

తామిరువురూ కలుసుకుంటున్న ఆ పత్రికా సంపాదకుడికి ఒక ఉత్తరం వ్రాశాడు. మన పత్రికలో అఖండ ఖ్యాతి గడించిన సరస్వతీదేవిగారి ఎడ్రసు తెలుపండి; వారి కథలమీద, పుస్తక సంపుటాలమీదా నా అభిప్రాయాలు తెలుపుతాను అలాఅని. సంపాదకుడు సరస్వతీదేవి, శేరాఫ్ అని ఒక పురుషుని పేరు; లెక్చరరు, ఫలానా కాలేజీ, మద్రాసు, అనియిచ్చాడు. ఆనాటినుంచీ సుబ్బారావు స్నేహితులకి ఒక అపూర్వ విషయం తెలిసింది. సుబ్బారావు ఎప్పుడూ పొగుడుకుంటూ వుండే సరస్వతీదేవి అనే రచయిత్రి- ఒక ఉపన్యాసకుడి కూతురు. ఒకరిద్దరికి సందేహం కలగకపోలేదు- కూతురే అవాలా. భార్య అవకూడదా? అని. కాని సుబ్బారావు నోటికి జడిసి బైటికి అనలేకపోయారు. చివరికి అతను ఎలాగో కనిపెట్టి అన్నాడు: 'భార్యఅయితే చూస్తూ ఊరుకుంటాడ్రా ఆ మొగుడు? ఇలాంటి బూతుకథలు రాయవద్దని చెప్పడూ?'

'అయితే అవి బూతు కథలంటావ్' అని అంటించాడు ఒక మిత్రుడు.

సుబ్బారావుకి కోపం వచ్చేసింది. 'శృంగార కథలు.' అన్నాడు ఉక్రోషం అపుకుంటూ.

స్నేహితులందరూ నవ్వారు.

సుబ్బారావు ఒకనాడు సరస్వతీదేవికి ఉత్తరం రాశాడు '—మీ కథలన్నీ చదివాను. చాల స్వాభావికంగానూ విస్తారంగానూ ఉన్నాయి. మీ కథలు పడిన ఆ పత్రికలో చాలసార్లు నాపేరు చూసిఉండాలి మీరు. సుబ్బారావు అని కొన్నాళ్లూ వెంకట సుబ్బారావని యిప్పుడూ నాపేరు.' ఇలా యింకా ఏమో చాలా వ్రాసి 'జవాబు కోసం, నా కథల మీద మీ విమర్శలకోసం ఎదురుచూస్తున్నాను.' అని చివర కాజాకలం వ్రాశాడు. ఎడ్రసు తెలిసేటట్లు వ్రాశాడు.

ఆరురోజులు గడిచి వుంటాయి. ఆనాడు సుబ్బారావు ఆశ ఫలించింది. సరస్వతీదేవి తన కథల గురించి వ్రాసింది. చాల బాగున్నవట. తన కథలకంటె యివే బాగున్నాయని తన ఇంట్లోవాళ్లు అన్నారట. తిరిగి ఉత్తరం వ్రాయటం మరచిపోవద్దని వ్రాసింది. తిరుగుటపాలో పంపాడు సుబ్బారావు — మరో వుత్తరాన్ని.

పదిహేనురోజులు గడిచాక సుబ్బారావు తానడిగిన ప్రశ్నకి సమాధానంగా 'నాకింకా వివాహం కాలేదు' అని సరస్వతీదేవి వ్రాసిన ఉత్తరంలో చూశాడు. అతని ఆనందానికి మితిలేదు. స్నేహి-

తులందరినీ అవహేళన చేశాడు. 'మాశారా, కథలు రాసేవాణ్ణి నన్నిట్టా తక్కువ చేసి చూస్తారు; నే నెప్పుడో కని పెట్టేశాను ఆవిడకి మేరేజి కాలేదని. పోనీ ఇప్పటికైనా మార్చు కున్నారా మీ అభిప్రాయం, ఆవిడ ఆ లెక్చరరు పెళ్ళాం కాదని!' అంటూ.

మూడు రోజులు కష్టపడి రాశాడొక ఉత్తరం. జీవితాని కంతటికీ సంబంధించింది. తనకి తల్లీ తండ్రీ లేరనీ, ఆస్తి ఏమాత్రమో వున్న దనీ, బి. ఏ. ప్యాసైనవాడనీ, వయస్సు ఇరవై మూడు సంవత్సరాలనీ. సరస్వతీదేవి తనని పెళ్ళి చేసుకోక పోయినా ఫర్వాలేదట. కాని చేసు కుంటే చాలా సంతోషిస్తాడట. నిజంగా బాగానే ఉంటుంది తమ కిద్దరికీ వివాహం అయితే. శృంగార శాస్త్రాన్ని తరిచి తరిచి చూసి, పరిశీ లించి, అనుభవించి, ఆ రకపు కథా సాహిత్యాని కొక ఉన్నత శ్రేణి యిచ్చి కళాఖండాలు వరసని వ్రాయవచ్చు. ఇదేమంత తక్కువ పనికాదు. పాఠకులకీ, పత్రికాధిపతులకీ పండగ అన్నమాట. కాని ఏ కారణం వల్లనో దీనికి సరస్వతీదేవి మాత్రం జవాబు వ్రాయలేదు. ఆలోచించి సంగ తంతా చెప్తాను. అని మాత్రం వ్రాసింది.

వాళ్ళ ఊళ్ళో కవి సమ్మేళనం. సుబ్బారావు సరస్వతీదేవికి సమాజం తరపున ఆహ్వానం పంపాడు. 'రావడానికి ప్రయత్నిస్తాను. వస్తే మీ దర్శనం తప్పక చేసుకుంటాను.' అని వ్రాసింది ఆమె.

కవి సమ్మేళనం జరిగింది. ప్రముఖ కవులూ రచయితలూ, పెద్దమనుషులూ అందరూ వొచ్చే స్తున్నారు. సుబ్బారావు ఆనాడు తన స్నేహి తుడు అచ్యుతరావుతో సభకు వెళ్ళాడు.

సభలో - ఒక సూటు వేసుకున్న యువకుడు నేటి పత్రికలు - భావకవిత్వం - శృంగారం- ఈ మూడు విషయాలనీ సమానాంతర ప్రసంగంలో చేర్చి మాట్లాడుతున్నాడు. అతని పేరు సత్య నారాయణ. బి. ఏ. ఆనర్సుట.

అచ్యుతరావు అకస్మాత్తుగా ఎగిరి గంతే శాడు. 'ఒరే వీడు చిన్నప్పుడు నాతో చదువు తున్నాడురా!' అని అన్నాడు. 'వీడు ఆ విధంగా పరిచితుడు. నాకు - ఇతడు శృంగారం గురించి మాట్లాడుతున్నాడు గాబట్టి పరిచితుడున్నూ' అని నవ్వాడు సుబ్బారావు. 'ఎలాగయినా వీణ్ణి మా యింటికి తీసుకుపోతానురా!' అన్నాడు అచ్యుతరావు.

మీటింగులో సత్యనారాయణ మాట్లాడటం అయిపోయింది. అనక వోటఫ్ థేంక్స్ ఉంది. అచ్యుతరావు స్టేజి దగ్గిరికి వెళ్ళి 'ఒరే సత్యనారా యణా!' అని అతని వీపు తట్టాడు.

సత్యనారాయణ కాస్త నిదానించి చూసి: 'జ్ఞాపకం రాలేదు గాని ఇక్కడ నన్ను ఒరే అని పిలవవద్దు' అన్నాడు మర్యాదగా.

'నేను రావి గంటి అచ్యుతరావుని. నీతో స్కూలు ఫైనలు చదువుకున్నాను. ఇంకా...'

'ఆఁ - జ్ఞాపకం వొచ్చావ్. నువ్వా!-'

మిత్రు లిద్దరూ పూర్వ స్మృతులు చెప్పు కుంటూ రోడ్డమ్మట నడుస్తున్నారు.

'నువ్విప్పుడేం చేస్తున్నావ్?' అని అడిగాడు అచ్యుతరావు.

'కాలేజీలో తెలుగు లెక్చరరుగా వుంటు న్నానులే నువ్వేం చేస్తున్నావ్?'

'ఏం చేస్తాం? ఇంటర్లో ఫెయిలు క్లాసొచ్చింది. మరి ఆ కష్టాలు పడలేక గుమస్తా నయ్యాను.'

సుబ్బారావుకి శృంగారం గురించి ఏవైనా ప్రశ్నలు వేయాలని ఉంటోంది. కాని వెయ్యటం లేదు. అలా నిశ్శబ్దంగా నడుస్తున్నాడు. సంభా షణ అంతా ఓపిగ్గా వింటున్నాడు. ఉండుండి సత్యనారాయణ ఒక పత్రిక పేరుచెప్పి 'ఆ పత్రిక ఎప్పుడయినా చూస్తున్నావా?' అని అడిగే సరికి ఉలిక్కి పడ్డాడు.

'మేం చూడక పోవటమేమిటి? అయినా ఎందుకా ప్రసంగం ఎత్తావు?'

'అందులో నా కథలు పడుతుంటాయిలే!'

భేష్. మరో రచయిత. ఆంధ్రదేశంలో దేనికి కరువైనా రచయితలకి కరువులేదు. అయితే - ఇతని పేరు సత్యనారాయణ అంటాడు, ఎక్కడా చూడలేదు సుబ్బారావు.

'నేను మీ పేరెప్పుడూ చూడలేదే!' అన్నాడు సుబ్బారావు. సత్యనారాయణ గంభీరంగా నవ్వి 'మారు పేరుతో రాస్తుంటానులెండి! నా పేరు జర్నల్సులో సత్యనారాయణ కాదు. సరస్వతీదేవి!'